క్లుప్తంగా

విశేషాలంకరణలో పోలేరమ్మ



మనుబోలు: మనుబోలు కోదండరామపురం దేవాంగులవీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు పంచామృతం, వివిధ రకాలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. మామిడికాయ ముక్కలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

ఎంఈఓగా వసంతకుమారి



బాధ్యతలు చేపట్టిన వసంతకుమారి

మనుబోలు: మండల విద్యాశాఖాధికారిణిగా జి.వసంతకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. చాలా కాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. వసంతకుమారి కొడవలూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు.

హెచ్ఎంకు సన్మానం



వెంకటాచలం: మండలంలోని కనుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. దీంతో టీచర్లు మంగళవారం మురళీమోహన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ షాపులో చోరీ



కొడవలూరు: గౌతమ్‌నగర్ వద్ద మద్యం షాపునకు సమీపంలో ఉన్న కూల్‌డ్రింక్స్ దుకాణంలో చోరీ సోమవారం రాత్రి జరిగింది. దుకాణ బయట ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి షట్టర్ తాళాలను పగులగొట్టి దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. రూ.1,800 నగదు, రూ.మూడు వేల విలువైన సిగరెట్లు, కూల్‌డ్రింక్స్‌ను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఘటన స్థలాన్ని ఇన్‌చార్జి ఎస్సై నరేష్ పరిశీలించారు.

మొలక పోలేరమ్మకు పూజలు



ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో కొలువైన మొలక పోలేరమ్మకు విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. తొలుత అమ్మవారికి చద్ది సమర్పించారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ బాధ్యులు ఎం.శ్యామ్‌ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, చొప్పా వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, సన్నికంటి మురళి పాల్గొన్నారు.

బురాన్‌పూర్ చెరువులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు



ప్రాణాలు పోతున్నాయ్!

- చెరువుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- బలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

గ్రావెల్‌కు గిరాకీ ఏర్పడటంతో ప్రభుత్వ భూములను తవ్వేసి సొమ్ము చేసుకున్న వ్యాపారులు చివరికి చెరువులను వదలడం లేదు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా తవ్వకాలు చేస్తుండటంతో పలు గ్రామాల్లో చెరువులు బావులను తలపిస్తున్నాయి. వాటిలో అయాయక ప్రజలు పడి మృత్యువాతకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఈనెలలో ఒక బాలుడు మృతిచెందాడు.



బావులను తలపిస్తున్న గ్రావెల్ గుంతలు

వెంకటాచలం: మండలంలో 80కి పైగా చెరువులున్నాయి. కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో గ్రావెల్, మట్టికి డిమాండ్ పెరగడంతో స్వార్థపరులు చెరువుల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో జోగుతూ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. అనుమతి లేకుండా చెరువుల్లో తవ్వకాలు జరపకూడదనే నిబంధనలున్నాయి. అయినా వ్యాపారులు అడ్డూ అదుపు లేకుండా యంత్రాలు పెట్టి మరీ తవ్వకాలు చేయిస్తున్నారు. గ్రావెల్ తరలించడంతో ఒక్కో చెరువులో బావులను తలపించే విధంగా గుంతలు ఏర్పడ్డాయి.

ఏటా మృత్యువాత

చెరువుల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి తరలిస్తున్న కారణంగా గుంతల్లో పడి ఏటా ప్రజలు మృత్యువాత పడుతున్నారు. పశువులకాపరులు, విద్యార్థులు వేసవి కాలంలో గ్రావెల్ గుంతల్లో పడి మృతిచెందుతున్నా అధికారులకు కనువిప్పు కలగడంలేదు. లోతైన గుంతల్లో పైకల్లా నీరు చేరడంతో పశువుల కోసం వెళ్లి లోతును గుర్తించలేక వాటిల్లో పడి చనిపోతున్నారు. ఏటా వేసవి కాలంలో పది మందికిపైగా ప్రాణాలు వదులుతున్నారు. మండలంలోని చెముడుగుంట, గొలగమూడి, అనికేపల్లి, కంటేపల్లి, శ్రీకాంత్ కాలనీ, కాకుటూరు, రామదాసుకండ్రిగ, సర్వేపల్లి, తదితర చెరువుల్లో తవ్విన గ్రావెల్ గుంతల్లో ఈతకు వెళ్లిన చిన్నారులు, పశువుల వద్దకు వెళ్లిన ప్రజలు చనిపోవడంతో ఆయా కుటుంబాల్లో అంతులేని విషాదం నెలకొంది. ఈనెల 5వ తేదీన కాకుటూరు గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు గ్రామ సమీపంలోని చెరువు వద్దకు సరదాగా ఈతకు వెళ్లారు. చెరువులో తవ్విన గ్రావెల్ గుంతలో మునిగి తన్మయ్ అనే 13 సంవత్సరాల బాలుడు మృతిచెందగా, మిగతా ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు.

అప్రమత్తత అవసరం

వేసవి నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులిస్తారు. విద్యార్థులు నివాసాల వద్దనే ఉంటారు. స్నేహితులతో కలిసి గ్రామాల సమీపంలోని చెరువుల వద్దకు సరదాగా ఈతకు వెళ్తుంటారు. అయితే ఈత సక్రమంగా రాని వారు వెళ్లడం వల్ల చెరువుల్లో తవ్విన గ్రావెల్ గుంతల్లో చిక్కుకుని మృతిచెందుతున్నారు. వేసవి సెలవులు ముగిసేంత వరకు తల్లిదండ్రులు తమ పిల్లలు చెరువుల వద్దకు వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే లోతు తెలియక ప్రమాదాల బారిన పడే అవకాశముంది. అధికారులు స్పందించి చెరువుల్లో అక్రమ తవ్వకాలను ఆపించాలని ప్రజలు కోరుతున్నారు.

వామ్మో.. భానుడి భగభగలు

పొదలకూరు: భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. 41 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచే సెగలు ప్రారంభం అవుతున్నాయి. రాత్రివేళల్లో జనం ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. పగటి వేళల్లో 11 గంటలకు రోడ్లపై జనసంచారం తగ్గిపోతోంది. గాలిలో తేమశాతం లేకపోవడంతో వడదెబ్బకు గురవుతున్నారు. పిల్లలు, వృద్ధులు బయటకు రావొద్దని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పనులపై వచ్చే వారు ఎండ వేడిమికి తాళలేకపోతున్నారు. బస్సుల్లో ప్రయాణం కూడా కష్టంగా మారుతోంది. వేడిగాలులు వీస్తున్నందు వల్ల అవస్థలు పడుతున్నారు. వడదెబ్బ కేసులు పెరుగుతున్నాయి. పొలం పనులకు సైతం తెల్లవారుజామున వెళ్లి ఉదయం 10 గంటల లోగా ఇంటికి చేరుకోవాల్సి వస్తోంది.



నిర్మానుష్యంగా ఉన్న పట్టణంలోని గేటుసెంటర్ రోడ్డు

జాగ్రత్తలు పాటించాలి

ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. నీరు అధికంగా తీసుకోవాలి. ఎండలో తప్పనిసరిగా బయటకు వెళ్లాలంటే గొడుగు లేదా టోపీ, టవల్ చుట్టుకోవడం మంచిది. ఎండకు పడుకోవడం, ఎక్కువ సమయం నిలబడి ఉండటం చేయకూడదు. చల్లటి ప్రదేశంలో ఉంటూ సేదతీరాలి. ఆహార అలవాట్లు కూడా మార్చుకోవాలి. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకుంటే మంచిది. బయటకు వెళ్లే వారు ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలిపి తాగాలి.



– డాక్టర్ నరసింహారావు, మండల వైద్యాధికారి

పోషక విలువలు తెలుసుకునేందుకే మట్టి పరీక్షలు

కొడవలూరు: భూమిలో పోషక విలువలు తెలుసుకునేందుకే మట్టి పరీక్షలు చేస్తున్నామని ఏఓ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాళెంలో మట్టి పరీక్షలను మంగళవారం చేపట్టి రైతులకు అవగాహన కల్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. అవసరమైన మేరే ఎరువులను వినియోగించడం ద్వారా మంచి దిగుబడిని సాధించొచ్చని చెప్పారు. మండలంలో 2025 – 26 సంవత్సరానికి గానూ 1,120 మట్టి నమూనాల సేకరణను లక్ష్యంగా నిర్దేశించామని, ప్రతి రైతు సేవా కేంద్ర పరిధిలో 80 నమూనాలను సేకరించాలని పేర్కొన్నారు. అనంతరం మట్టి పరీక్షల పత్రాలను రైతులకు అందజేశారు. ఏఈఓ వెంకట్రావు, వీపీఏలు నిహారిక, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.



పెన్‌కాక్ సిలాట్‌లో ఉత్తమ ప్రతిభ

కోవూరు: బెంగళూరులో ఇటీవల నిర్వహించిన పెన్‌కాక్ సిలాట్ జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో తమ కళాశాల నాలుగో సంవత్సర ట్రిపుల్ ఈ విద్యార్థి సుజిత్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సందీపకుమార్ తెలిపారు. కళాశాలలో విద్యార్థిని మంగళవారం అభినందించారు. అడ్మిషన్స్ డీన్ కుమార్, ట్రిపుల్ ఈ విభాగాధిపతి రవికుమార్, పీడీ అశోక్‌కుమార్, సహాయ పీడీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సదస్సు జయప్రదానికి పిలుపు



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోవూరులోని షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం నిర్వహించనున్న చెరకు రైతుల సదస్సును జయప్రదం చేయాలని చెరకు రైతుల సంఘ జిల్లా కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. చెరకు రైతుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న సదస్సుకు సంబంధించిన ప్రచార జాతాను మండలంలోని కాగులపాడు పంచాయతీ శ్రీరంగరాజపురంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బకాయిలను రైతులకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నేతలు రఘురామయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో టీబీ పరీక్షలు

పొదలకూరు: జిల్లా టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఆదేశాల మేరకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి ఉందో లేదో తెలుసుకునేందుకు మంగళవారం పరీక్షలను నిర్వహించారు. సీవైడీబీ పరీక్షలను శిరీష, నజ్మా సుల్తానా, మల్లికార్జున, పవన్‌కుమార్, రాధా, వైద్యులు పరీక్షలను చేశారని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ వెల్లడించారు.

డిగ్రీ పరీక్షలకు 115 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల పరిధిలో మంగళవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 115 మంది గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 1,725 మందికి గానూ 1,610 మంది హాజరయ్యారని వెల్లడించారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

పొదలకూరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డు ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద మంగళవారం మహిళను మోటార్‌బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు.. స్థానిక మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న సీహెచ్ స్వరూప రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తోంది. మండలంలోని గురువాయపాళెం గ్రామానికి చెందిన జి.దొరసానయ్య బైక్‌పై వెళ్తూ ఆమెను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో స్వరూప తలపై గాయం కావడంతో స్థానికులు వెంటనే సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్లో శస్త్రచికిత్సలు

వెంకటాచలం: వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్లో కన్ను నల్లగుడ్డు మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు కంటి వైద్య నిపుణులు శశాంక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఒకేరోజు ఐదు శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశామన్నారు.

నేత్రదానం



రమణమ్మ (ఫైల్)

విడవలూరు: స్థానిక కెనరా బ్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న పల్లాల రమణమ్మ (65) మంగళవారం మృతి చెందారు. ఆమె కుటుంబసభ్యుల కోరిక మేరకు నేత్రాలను విడవలూరుకు చెందిన మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. నేత్రాలను టెక్నీషియన్ నాగేశ్వరరావు సేకరించారు.

స్థలం ఆక్రమించారని ఐదుగురికి నోటీసులు

- వారంలోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆదేశం

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల స్థలాన్ని ఆక్రమించారని కలెక్టర్, జెడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు ఐదుగురికి పంచాయతీ సెక్రటరీ ఉగ్గు శ్రీనివాసులు మంగళవారం నోటీసులను జారీ చేశారు. వారం రోజుల్లోగా స్వచ్ఛందంగా తమ ఆక్రమణలను తొలగించుకోవాలని లేకుంటే పంచాయతీ వారే తొలగిస్తారన్నారు. అందుకయ్యే ఖర్చులను ఆక్రమణదారుల నుంచి రాబట్టడం జరుగుతుందని నోటీసులో పేర్కొన్నారు. పట్టణానికి చెందిన పెసల రాము, వినాయకస్వామి దేవస్థానాన్ని నిర్మించేందుకు దాతలుగా వ్యవహరిస్తున్న దేవరం ప్రసాద్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, మారు వెంకటరామిరెడ్డి, మన్నెం శ్యామ్‌ప్రసాద్ (వీరందరికీ కలిపి ఒక నోటీస్), షేక్ ఖాదర్‌బాషా, కృష్ణం శ్రీనివాసులు, ఆకుమళ్ల రమణయ్యకు నోటీసులను అందజేశారు. అయితే కృష్ణం శ్రీనివాసులు నోటీసును స్వీకరించలేదని సెక్రటరీ వెల్లడించారు. ఇటీవల పెసల రాము పాఠశాల లోపలి భాగంలో తమ పూర్వీకులకు స్థలం ఉందని అందుకు సంబంధించిన రికార్డులున్నాయని ప్రహరీని కూల్చి దుకాణాల నిర్మాణం చేపట్టాడు. దీంతో స్థానికులు అడ్డుపడే ప్రయత్నం చేయగా వివాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో కొందరు పాఠశాల స్థలం కబ్జాకు గురవుతున్నట్టు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి జెడ్పీ సీఈఓను సోమవారం పంపి విచారణ నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. ఫలితంగా సీఈఓ విద్యారమ పాఠశాల స్థలంతోపాటు ఆక్రమణలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వెంటనే మండల సర్వేయర్‌ను సర్వే నిర్వహించి స్కెచ్ అందజేయాల్సిందిగా సూచించారు. దీంతో మండల సర్వేయర్ గోపీనాథ్ స్కెచ్ అందజేయడంతో ఆక్రమణలో 6 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు సంబంధిత వ్యక్తులకు నోటీసులను అందజేశారు. అయితే ఇందులో రామనగర్‌గేటు సెంటర్‌కు చెందిన గ్రామపెద్దలు, యువకులు పార్టీలకతీతంగా కలిసి వినాయక స్వామి దేవస్థానాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. దీంతో దేవస్థానాన్ని కూడా తొలగిస్తారా? అనే చర్చ పట్టణంలో జరుగుతోంది.

అక్రమ మోటార్లపై విజిలెన్స్ కొరడా

- పంటపాళెంలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ, తహసీల్దార్

ముత్తుకూరు: వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా మోటార్లను ఏర్పాటు చేసి భూగర్భ జలాలను అక్రమంగా తోడేస్తున్న వైనంపై విజిలెన్స్ – ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం కొరడా ఝుళిపించారు. సీఐ సుభాన్, ఏఓ వేణుగోపాల్, తహసీల్దార్ స్వప్న, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు బృందంగా ఏర్పడి పంటపాళెం పంచాయతీలో తనిఖీలు నిర్వహించారు. 13 ప్రాంతాల నుంచి భూగర్భ జలాలను తోడేస్తున్నట్టు, ట్యాంకర్ల ద్వారా పామాయిల్ కంపెనీలకు తరలిస్తున్నట్టు గుర్తించారు. విద్యుత్ కనెక్షన్లకు అనుమతి ఒక విధంగా తీసుకుని యథేచ్ఛగా నీళ్ల వ్యాపారం సాగిస్తున్నట్టు నిర్ధారించారు. భూములు లీజు తీసుకుని బోర్లు ఏర్పాటు చేసినట్టు బయటపడింది. 13 మందిపై ఫిర్యాదులుండగా, 3 మోటార్లను మాత్రమే తనిఖీ చేయడం విమర్శలకు దారితీసింది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమణమ్మ

మనుబోలు: మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పిడూరుపాళెం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీలు సంపూర్ణ, సుబ్బమ్మ, రాధ, ఉమామహేశ్వరి, రమణమ్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కళాశాలలు ప్రత్యేక దృష్టి సారించాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో మంగళవారం కాకుటూరులోని వీఎస్‌యూలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. మంచి ఫలితాలను రాబట్టాలని తెలియజేశారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధనలపై అభిరుచి పెంపు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి, పరీక్షల నిర్వహణ, అధ్యాపకుల శిక్షణ తదితర అంశాల గురించి మాట్లాడారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ కాలక్రమేణా విద్యా విధానాల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా కళాశాలల్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. సమావేశంలో వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ హుస్సేనయ్య, డాక్టర్ హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా జైల్లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి ఆరాతీశారు. జిల్లా జైల్లో పారా లీగల్ వలంటీర్‌ను నియమించడం జరిగిందని, వారి ద్వారా సమస్యలపై అర్జీలిస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు వ్యాయామం అవసరం



కొడవలూరు: ప్రత్యేకావసరాల పిల్లలకు సెలవుల్లోనూ వ్యాయామం అవసరమని ఫిజియోథెరపీ వైద్యుడు శ్రీనివాసులు సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేకవసరాల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వేసవి సెలవుల్లో ప్రత్యేకావసరాల పిల్లలు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పిల్లలకు భోజనాన్ని వీఆర్వో చింతం వెంకటేశ్వర్లు ఏర్పాటు చేశారు. వాటర్ బాటిళ్లు, పెన్సిల్ బాక్సులను దువ్వూరు ముఖర్జీ, అనిత.. స్టీల్ గ్లాసులను ఉపాధ్యాయురాలు హైమావతి అందజేశారు. భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు సునీత, హెచ్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పవర్‌ను రద్దు చేయడం తగదు

విడవలూరు: దళిత మహిళనని చూడకుండా, తనపై రాజకీయాలు చేసి చెక్ పవర్‌ను రద్దు చేయడం సరికాదని ముదివర్తి సర్పంచ్ విడవలూరు నిర్మలమ్మ పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం రఫీ అనే వ్యక్తితో కలిసి టీడీపీలో చేరానని చెప్పారు. పంచాయతీ సొమ్మును తాను దుర్వినియోగం చేశానంటూ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ నోటీసులను అధికారులు జారీ చేయడం బాధాకరమని చెప్పారు. పంచాయతీకి సంబంధించిన బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబర్ తనవి కాదని, ఈ మొత్తాన్ని రఫీనే చూసుకుంటున్నారని, ఆయన ఎక్కడ చెప్తే అక్కడ వేలిముద్ర వేస్తున్నానని తెలిపారు. ఒకరి మాటలు విని చెక్ పవర్‌ను రద్దు చేయడం సరికాదని చెప్పారు. ఇమామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

కొడవలూరు: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తలమంచి – కొడవలూరు స్టేషన్ల మధ్య మూడో లైన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. మృతుడికి సుమారు 40 నుంచి 45 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు పింక్, పసుపు రంగు నిలువు ధారల ఫుల్ షర్ట్, సిమెంట్ రంగు లుంగీ, మహా సిమెంట్ కంపెనీ పసుపు టీ షర్టును ధరించి ఉన్నారు. ఘటన స్థలాన్ని కావలి రైల్వే ఎస్సై రమాదేవి పరిశీలించారు. మృతదేహాన్ని కావలి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లీపురంలో కార్డన్ సెర్చ్

నెల్లూరు సిటీ: అల్లీపురం టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్‌ను మంగళవారం నిర్వహించారు. 700 గృహాల్లో నలుగురు సీఐలు, 12 మంది డీఎస్పీలు, 70 మంది కానిస్టేబుళ్లు తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని మూడు బైక్‌లు, ఆటో, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.